క్లుప్తంగా

జగనన్న కాలనీలో విద్యుత్ కాంతులు



యడ్లపాడు: వైఎస్సార్ జగన్న కాలనీల్లో వేగంగా మౌలిక సదుపాయాలు సమకూరుతున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచి రావూరి వేణుగోపాలరావు చెప్పారు. మండలంలోని తుర్లపాడు గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతనంగా విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలను ఏర్పాటు చేశారు. విద్యుత్, పంచాయతీ అధికారులతో కలిసి సర్పంచి వేణు సోమవారం స్విచ్ఆన్‌చేసి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి మక్కెన సుబ్బారావు, జూనియర్ లైన్‌మెన్ షేక్ మస్తాన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గుమ్మా లక్ష్మీపతి, వడ్లాన అంకమ్మరావు, మాజీ సర్పంచి సతీష్‌చంద్ర, ఎ.హరిబాబు, కాంట్రాక్టర్ కె.నరేష్, సూపర్‌వైజర్ కె.వెంకటేష్, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా రామయోగి స్వామి ఊరేగింపు



వినుకొండ(నూజెండ్ల): అవదూత పొట్లపాటి రామయోగి స్వామి 111వ ఆరాధనోత్సవాల సందర్భంగా వినుకొండలో స్వామివారి భక్తులు చిత్రపటం ఊరేగింపు చేపట్టారు. స్వామివారి సంకీర్తలనతో మేళతాళాలతో పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సానాల పుల్లయ్య, బద్దిగం వెంకట నరసింహారావు, రామయ్య, అంకమ్మరావు, గురవమ్మలతోపాటు పలువురు పాల్గొన్నారు.

కెనాల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నరసరావుపేట ఈస్ట్: నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పీడబ్ల్యూడీ వర్క్‌షాప్స్ అండ్ కెనాల్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ కెనాల్స్ లింగంగుంట్ల సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. కెనాల్స్ పరిధిలో ఖాళీగా ఉన్న 1100 పోస్టులను భర్తీ చేయాలనీ, ఫీల్డ్ స్టాఫ్‌కు ముఖ హాజరునుంచి మినహాయింపు ఇవ్వాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉప్పటపాటి రంగయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కాసా రాంబాబు, కంబాల శ్రీనివాసరావు, మక్కెన సోమేశ్వరరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అంకారావు బాధ్యతలు స్వీకరణ

రొంపిచర్ల: మండల నూతన తహసీల్దార్‌గా జి.అంకారావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జె.శ్రీనివాసరావు మంగళగిరి సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అంకారావును వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అంకారావు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

స్వీకరించిన బాధ్యతలకు న్యాయం చేయండి

నరసరావుపేట: స్వీకరించిన బాధ్యతలను సంపూర్ణంగా పూర్తిచేసి వర్గ ప్రజలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణ రజక జనసేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మోటుపల్లి హరిప్రసాదు(అంజి)కు దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి అభినందించారు. కార్యదర్శి కొత్తపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షుడు మక్కెన లక్ష్మీనారాయణ, కోశాధికారి గొప్పరాజు వెంకట నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎనుముల దుర్గాపద్మజ, జాయింట్‌సెక్రటరీ బలుసుపాటి శ్రీనివాసరావు, చెరుకూరి శంకర్, వేమవరపు ఆంజనేయులు, పాదిలిశంకర్‌లతో పాటు పలువురు మెంబర్లుగా ఎన్నికయ్యారు. 33వ వార్డు నాయకుడు మర్రిపూడి రాంబాబు, దావులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు నాంది పలికిన పాదయాత్ర

ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



నరసరావుపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలనే ఎన్నికల మేనిఫెస్టోగా పెట్టి అందులో 97 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ప్రజాసంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వినుకొండ పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్ర దేశ రాజకీయాల్లో ఒక సంచలనం, చారిత్రాత్మకమని అన్నారు. రాజన్న రాజ్యం తీసుకురావాలన్న సంకల్పంతో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి సమాధి వద్ద 2017 నవంబరు 6న వేసిన తొలి అడుగు ఎండ, వాన లెక్కచేయకుండా రాష్ట్రంలో 13 జిల్లాల్లో 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర యాత్ర సాగిందన్నారు. కోట్లాది మంది ప్రజల హృదయాలను దక్కించుకొని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 2019 జనవరి 9వ తేదీన ముగిసిందని తెలిపారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ప్రధానమైనది గ్రామ పరిపాలన అని, ఈ నేపథ్యంలోనే గ్రామసచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామస్వరాజ్య సాధనలోనే కొత్త ఒరవడి సృష్టించారన్నారు. సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగాలు ఇచ్చారని, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారని అన్నారు. గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీలు ఇలా ప్రతి గ్రామానికి విలువైన ఆస్తులు సమకూరాయన్నారు. అమ్మఒడి, ఆరోగ్య శ్రీ, మహిళాసాధికారత, విద్యాదీవెన, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఇవన్నీ ప్రజాసంకల్పయాత్రలో మొగ్గతొడిగినవే అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్రే ప్రభుత్వానికి పునాది..

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా చేసిన ప్రజాసంకల్పయాత్ర ప్రభుత్వానికి పునాది వేసిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ప్రజాసంకల్పయాత్ర ముగిసి నాలుగేళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏడో వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేకును కట్‌చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలను తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్రలో పేదలు పడుతున్న కష్టాలను చూసిన మేరకు అధికారంలోకి రాగానే వారి అభ్యున్నతికోసం సంక్షేమపథకాలైన నవరత్నాలను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఈ యాత్రలో కష్టపడి జెండాలు మోసిన ప్రతి కార్యకర్తకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏడవ వార్డు నాయకులు గేరా ధర్మారావు, ముద్దా కరిముల్లా, షేక్ జిలాని, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పాలనకు నాంది జగనన్న సుదీర్ఘంగా కొనసాగించిన పాదయాత్రే కారణమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ అధినేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనాడు చేసిన ప్రజాసంకల్పయాత్ర ముగిసి జనవరి 9వతేదీతో నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3,648 కిలో మీటర్లు నిర్వహించిన సుదీర్ఘ పాదయాత్ర ఒక రికార్డన్నారు. ఈ యాత్ర ద్వారా జగనన్న దాదాపు రెండు కోట్ల మందిని ప్రత్యక్షంగా కలిశారని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కన్నీళ్లు, కష్టాలను ఈ పాదయాత్ర ద్వారా జగనన్న ప్రత్యక్షంగా చూశారని, వారి సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రలో నుంచి పుట్టుకొచ్చిన పథకాలే ఈ రోజు రాష్ట్రంలో అమలౌతున్న సంక్షేమ కార్యక్రమాలని వివరించారు.



చిలకలూరిపేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలనే మేనిఫెస్టో రూపంలోనూ తీసుకొచ్చారని వెల్లడించారు. ఆ మేనిఫెస్టోను మూడున్నరేళ్ల కాలంలోనే 98 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, నాయకులు తోట రాజేంద్రప్రసాద్, షేక్ అల్లీమియా, వి.కోట్యా నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

బడుగుల జీవితాల్లో 'నవోదయం'

జగనన్న బడుగు వికాసం కింద లబ్ధిదారుడికి కార్లు అందజేసిన కలెక్టర్



లబ్ధిదారుడికి కారు తాళాలను అందజేస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: నవోదయంలో తమకు వాహనాలు కావాలంటూ దరఖాస్తు చేసుకున్న యువకుడికి జగనన్న బడుగు వికాసం పథకం కింద మంజూరైన రెండు కార్లను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. ప్రతి నెల 14న ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం నవోదయం నిర్వహిస్తున్న విషయం విదితమే. నరసరావుపేట బలాబజార్‌కి చెందిన రాజేష్ ఖన్నాకు హోండా అమేజ్, బొలెరో నియో వాహనాల కోసం జగనన్న బడుగువికాసం పథకం ద్వారా నవోదయంలో దరఖాస్తు చేసుకున్నాడు. సదరు దరఖాస్తుదారునికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.21.8 లక్షలు రుణం మంజూరు చేసింది. వాటితో కొనుగోలు చేసిన బొలెరో నియో, హోండా అమేజ్ వాహనాలను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించి సంబంధిత వాహన తాళాలు లబ్ధిదారునికి అందజేశారు. దీనిలో 45 శాతం సబ్సిడీతో 15% లబ్ధిదారిని వాటాగా వాహనాలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, హార్టికల్చర్ అధికారి జాన్ బెన్నీ బిల్లా, సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఓబుల నాయుడు, నవోదయం నోడల్ అధికారి సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ఏడో వార్డులో మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గత మూడున్నరేళ్లలో వార్డులో ఉన్న మూడువేలమంది ఓటర్లకు రూ.6.14కోట్లతో సంక్షేమ పథకాలు అందించామని, మరో రూ.1.60కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు ప్రధానంగా తీసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. వార్డు ఇన్‌చార్జి గేరా ధర్మారావు, నాయకులు ముద్దా కరిముల్లా, గేరా రాజు, ఆకాష్, సన్నీ, మాజీ కౌన్సిలర్ షేక్ జిలాని, డీలర్ జిలానీలతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏడవ వార్డులో పర్యటించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఇప్పటివరకు ప్రతి గృహానికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అమ్మఒడి, డ్వాక్రా మహిళలకు ఆసరా, చేయూత, జగనన్న చేదోడు, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి సంక్షేమపథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో ఈ వార్డులో ఉన్న సుబ్బారెడ్డి ప్లాట్లు, మరికొంత పంచాయతీ పరిధిలో ఉండేదన్నారు. వాటిని పురపాలక పరిధిలోకి తీసుకొచ్చి సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపులైన్లు కోసం రూ.1.60కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే 210మందికి ఇళ్లపట్టాలు అందించామన్నారు. మరో 30మంది దరఖాస్తు చేయగా రెండో ఫేజ్‌లో అందిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎంఈ డి.శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణరాజు, మాజీ కౌన్సిలర్లు అబ్దుల్ సత్తార్, మాడిశెట్టి మోహనరావు, నెలటూరి మురళి, బత్తుల లక్ష్మీపద్మలత, మాగులూరి రమణారెడ్డి, నాయకులు షేక్ కరిముల్లా, జి.అచ్యుతరావు, ఇంజనీర్ కె. కమలాకర రెడ్డి, కాకుమాను మంగపతిరెడ్డి, కందుల ఎర్ర, మల్లెల అశోక్, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, ఎస్‌కే ఆంజనేయులు, సయ్యద్‌ఖాదర్‌బాష, సన్నీ, సైదా, పింటు పాల్గొన్నారు.

అగ్రహారం రైతులకు త్వరలో పాస్‌పుస్తకాలు

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



సర్వే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఈపూరు: ఎన్నో సంవత్సరాలుగా భూములను అనుభవిస్తూ ఎటువంటి హక్కు పత్రాలు లేకుండా ఉన్న అగ్రహార భూములకు సర్వే చేయించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని అంగలూరు గ్రామంలో అగ్రహార భూముల సర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అంగలూరు, గుమ్మనంపాడుతో పాటు మరికొన్ని గ్రామాల్లో 17,152 ఎకరాల అగ్రహార భూములకు హక్కు పత్రాలు లేకుండా రైతులు ఉన్నారని, వారు బ్యాంక్‌ల్లో లోను పొందాలన్నా, ఎటువంటి ప్రభుత్వ పథకాలు పొందాలన్నా అనర్హులుగా ఉన్నారన్నారు. ఇది గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రీసర్వేలో భాగంగా వారికి హక్కులు కల్పించేందుకు సర్వే ప్రారంభించామని, సర్వే అయిన వెంటనే పూర్తిస్థాయిలో పాస్‌పుస్తకాలు ఇప్పించి అన్ని హక్కులు కల్పిస్తామన్నారు. ఈనాం, అగ్రహార భూములపై రైతులకు హక్కు కల్పించేందుకు అసెంబ్లీ సమావేశాలు జరిగిన ఈనాం, అగ్రహారం భూముల గురించి మాట్లాడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆయన సహకారంతో భూములను సాగు చేసుకుంటున్న రైతులకి హక్కులు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నామని, మీ భూమిపై మీకు హక్కు కల్పించేందుకు ఎన్ని కష్ట, నష్టాలైనా లెక్కచేయనని, ఎంత దూరమైనా వెళ్లి ఈ హక్కును రైతులకు కల్పిస్తానన్నారు. రీ సర్వే జరుగుతున్న సమయంలో రైతులందరూ అందుబాటులో ఉండి వారి పొలం హద్దులను వారికి వారి భూమికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉంటే సర్వే అధికారులకు తెలియపరచి ఈ రీసర్వేకి సహకరించాల్సిందిగా కోరారు. తహసీల్దార్ విజయజ్యోతికుమారి, జడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, సర్పంచ్ సన్నెబోయిన కుసుమ అంకారావు, శాకమూరి బుచ్చయ్య, గోలి ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు దుడ్డుగుల జానయ్య, ఎంపీడీవో ఉషాకిరణ్, సర్వేయర్ చండీరాణి పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

వినుకొండ రూరల్ సీఐ ఎస్.రమేష్‌బాబు

శావల్యాపురం: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఎస్.రమేష్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక మండల పోలీసు స్టేషన్‌ను సీఐ సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న సంక్రాంతి వేడుకలు పురస్కరించుకొని పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోడిపందేలు, అసాంఘిక కార్యాకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పోలీసు నిఘా ఉంటుందన్నారు. కోడిపందేల నిర్వహణ చట్టారీత్యా నేరమన్నారు. ఇప్పుటికే మండల స్థాయిలో ఎస్ఐలకు, పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలందరు సంప్రదాయబద్ధంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయనతో పాటు హెడ్‌కానిస్టేబుల్ కిరణ్, సిబ్బంది గంగిరెడ్డి ఉన్నారు.

వలంటీర్ల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ

ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య

శావల్యాపురం: గ్రామ సచివాలయాల్లోని వలంటీర్ల పనితీరు, విధివిధానాలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తామని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం స్థానిక గ్రామసచివాలయం పరిధిలో వలంటీర్లుకు ప్రభుత్వ పథకాల అమల తీరు పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ శావల్యాపురం గ్రామసచివాలయ పరిధిలోని వలంటీర్లు అంకిత భావంతో విధులతో నిర్వహించి అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా తమ వంతు బాధ్యత వహించాలన్నారు. ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ పథకాలపై సమాచారం తెలపాలన్నారు. విధుల్లో ఆలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి దారివేముల రవీంద్ర, వలంటీర్లు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆవుల భాస్కర్

నాదెండ్ల: ఆధునిక సాంకేతికను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల్లో నగదును కొల్లగొడుతున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఆవుల భాస్కర్ తెలిపారు. నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం యూనియన్‌బ్యాంక్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్పరెన్సీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాశ్యత - సైబర్ నేరాలపై సచివాలయాల మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎప్పుడూ తెలపకూడదన్నారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అధికారుల్లా ఫోన్‌లు చేసి మీ ఖాతా బ్లాక్ అవుతుంది... రెన్యువల్ చేసుకునేందుకు పాన్ కార్డు, ఖాతా వివరాలు తెలపాలని ఫోన్ చేస్తుంటారన్నారు. లాటరీలో కారు లేదా నగదు వచ్చినట్లు ఫోన్ చేసి, బ్యాంకు ఖాతా వివరాలు అడుగుతారని, ఏటీఎం కేంద్రాల వద్ద మనీడ్రా చేసే సమయంలో కేటుగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారిపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇలాంటి నేరాల పట్ల మహిళా పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారులు ఎ.రవికాంత్, బి.పృధ్వీరాజ్, అన్ని సచివాలయాల మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నాదెండ్ల: గర్భిణులు తక్కువ ధరలో లభించే తాజా ఆకుకూరలు, పండ్లు, పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.ప్రసాద్‌నాయక్ చెప్పారు. గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీ సత్యసాయి సేవా సమితి సహకారంతో ప్రధానమంత్రి స్వస్థ మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం 43 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం పాలు, పండ్లు, గుడ్లు అందించారు.

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడి వ్యాఖ్యలు వ్యక్తిగతం

నరసరావుపేట: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు కర్ణా అమరసైదారావు వ్యాఖ్యలు కేవలం అతని వ్యక్తిగతమైనవని ఆ పార్టీ నాయకులు పలువురు సోమవారం ఒక ప్రకటన తెలిపారు. పార్టీ అధ్యక్షులు రాష్ట్రంలోని కొంతమంది జిల్లా అధ్యక్షులకు పదోన్నతి కల్పిస్తూ నూతన అధ్యక్షులను నియమించార ప్రధాన కార్యదర్శులు కామినేని హనుమంతరావు, శెట్టి హనుమంతరావు పేర్కొన్నారు.

● ఆధార్ అనుసంధానం చేసుకోవాలి : ఏపీఓ విజయకుమారి



యడ్లపాడు: మహాత్మగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం వేతనదారుల ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరితగతిన చేసుకోవాలని పథకం మండల ఏపీఓ విజయకుమారి చెప్పారు. యడ్లపాడు మండలం పరిధిలో సుమారు 13వేలకు పైగా జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. పథకం నిర్వహణకు ప్రభుత్వం కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో ప్రతి కూలీ జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం విధిగా చేయాల్సి ఉందన్నారు. గతంలోనే దాదాపుగా అన్నింటికీ ఆధార్ అనుసంధానం చేశామన్నారు. వీటిలో 11,536 మంది ఆన్‌లైన్‌లో నమోదు ఫెయిల్ అయ్యాయని, తిరిగి వీటిని అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. గతవారం రోజులుగా 9,798 మంది ఆధార్ కార్డులను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశామన్నారు. ఇంకా 1,738 మందివి చేయాల్సి ఉందన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌లో ప్రతి వేతనదారుడి జాబ్‌కార్డుకు ఆధార్ నమోదు తప్పనిసరి అన్నారు. అలా చేసుకున్న వారికే పనిడిమాండ్, విధులు కేటాయించడం జరుగుతుందన్నారు.ఇంకా ఆధార్ అనుసంధానం చేసుకోని వారు త్వరితగతిన చేసుకోవాలన్నారు.

● శ్మశాన స్థలం కేటాయింపుపై హర్షం..

నరసరావుపేట: మండలంలోని ములకలూరు గ్రామంలో మాదిగ వర్గీయులకు స్మశాన వాటికను కేటాయించినందుకు జిల్లాకలెక్టర్ ఎల్.శివశంకర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌ను కలిశారు. జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్యమాదిగ మాట్లాడుతూ ములకలూరులో పాత శ్మశాన వాటికి చాలక మాదిగ వర్గానికి చెందినవారు ఎంతో ఇబ్బంది పడుతున్నారని కొత్త శ్మశానం కోసం గత కొన్నేళ్లుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఎవరూ స్పందించలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలతో సర్వేనెంబర్ 64లో 75 సెంట్లు కేటాయిస్తూ తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. దీంతో ఎస్సీ వర్గానికి చెందిన అందరూ సంతోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో చందాల మరిదాసు, ఎం బాబురావు, ఇజ్రాయేలు, నందిగం ప్రసంగి, ములకలూరు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.


● జాన్‌డేవిడ్ సేవలు నిరుపమానం




డాక్టర్ జాన్‌డేవిడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: పేదల అభ్యున్నతికి కృషి చేసిన డాక్టర్ ఎస్.జాన్‌డేవిడ్ సేవలు ఆదర్శనీయమైనవని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ, ఫార్‌కార్నర్స్, వేద స్వచ్ఛంధ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్‌డేవిడ్ వర్ధంతిని ఏఎంజీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలని దేవుడు చూపిన మార్గంలో జాన్‌డేవిడ్ పలు సంస్థలను స్థాపించారన్నారు. విద్యాసంస్థల ద్వారా పేద పిల్లలకు చదువులు చెప్పించారని తెలిపారు. కుష్ఠు, క్షయ వ్యాధిగ్రస్తులతో పాటు వివిధ వ్యాధుల బారిన పడిన వారికి ఉచిత వైద్య సౌకర్యాలను కల్పించారన్నారు. ఏఎంజీ డీడీ కెజియా మహంతి, వేద సంస్థల డైరెక్టర్ యోహాయాకిన్, డాక్టర్ హన్నా మమత, మాశిలామణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



మృతుడు లింగయ్య



ఘటనా స్థలంలో గుర్తు తెలియని మృతదేహం

వినుకొండ(నూజెండ్ల): ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్న సంఘటనలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై నడిగడ్డ అడ్డరోడ్డువద్ద సోమవారం జరిగింది. సేకరించిన వివరాలప్రకారం వినుకొండ రూరల్‌మండలం కొత్తపాలెం గ్రామనికి చెందిన చలమల లింగయ్య(65) వినుకొండ నుంచి కొత్తపాలెం వస్తుండగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం రావటంతో ఒకరికొకరు ఢీకొట్టుకున్నారు. ఈప్రమాదంలో లింగయ్య మృతి చెందాడు. వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గూడ్స్ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి...

నరసరావుపేట టౌన్: గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ టి.సుబ్బారావు సోమవారం తెలిపారు. సాతులూరు రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సుగల వ్యకిని గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసినవారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత...

చిలకలూరిపేటటౌన్: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా గజపతి నగరం మండలం, కాలంరాజుపేట కు చెందిన పిల్లా రాధ (24)కు అనకాపల్లికి చెందిన గంగాధర్‌తో వివాహం జరిగింది. 2018లో భర్త మృతి చెందటంతో ఆమె తన ఏడు సంవత్సరాల బాబుతో కలసి పట్టణంలోని పండరీపురంలో నివాసం ఉంటుంది. వంటపని చేస్తూ జీవనం కొనసాగిస్తున్న రాధ ఆదివారం రాత్రి యధావిధిగా పని ముగించుకొని ఇంటికి వెళ్లి తలుపులు వేసుకుంది. సోమవారం ఉదయం రాధ ఎంతసేపటికి తలుపులు తీయకపోవటంతో పక్కింటి వారు అనుమానం వచ్చి చూడగా ఆమె మృతిచెంది కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.